



కృంగిపోతున్న రవిని చూసి సంధ్యాకాంత విలపిస్తున్నట్లు పశ్చిమాన్ని ఆకాశమంతా ఎఱ్ఱగా ఉంది

తెల్లటి మబ్బు తునకలు ఒకదాన్ని ఒకటి తరుముతూ ఆడుకొంటున్నాయి ఆటలు చాలించి ఇంటికి జేరుకోండని హెచ్చరిస్తూ నల్లని మబ్బు తునకలు, పరుగులతో వస్తోంది దాన్నిచూసి భయపడ్డ తెల్ల మబ్బుతునకలు దూరంగా పారిపోతున్నాయి

ప్రకృతిలోని అందం పసివాళ్ళ మనస్సులా నిర్మలంగా ఉంటుంది

కిటికీ దగ్గర నిలుచున్న రమ శోక దేవతలా ఉంది ఆలోచనల ఆవేగంతో మరుగుతున్న మనస్సులోంచి లేచిన ఆవిరి కంటినుంచి నీరుగా కారుతోంటే ఆపటం రమకు చేతకావడంలేదు

సంధ్యారాగంలోని ప్రకృతికాంత అందంగాని, పరుగుపందాలు వేసుకొని ఆడుకొంటున్న మబ్బు తునకల చిలిపిదనంగాని రమ దృష్టిని ఆకర్షించలేకపోతున్నాయి

"మమత కెలాఉంది?" రమ మనస్సును పీడిస్తున్న సమస్య దానిచుట్టూ తేనెటీగల్లా జాయ్యమని రొదచేస్తూ అనేక ప్రశ్నలు అలముకొంటున్నాయి

"మమతతో తనకేమిటి సంబంధం మమతకోసం తనెందుకు బాధపడాలి?" ఎంత సరిపెట్టుకొందామని ప్రయత్నించినా రమ మనస్సు పూరట చెందటంలేదు

ఆ రోజు జరిగిన ఒకే ఒక్క సంఘటన మమత తనకు దూరంచేసింది ఎంతమరచిపోదామని ప్రయత్నం చేస్తున్నా ఆ సంఘటన తాలూకు ఛాయలు కేన్సరు వ్యాధిలా శరీరంలోని అణువణువుకు అలముకొంటున్నాయి మమత దగ్గరకు వెళ్ళాలని మనస్సు ఆరాటపడుతున్నా అడుగు ముందుకు పడటంలేదు ఆగలేక, వెళ్ళలేక సతమతమవుతోంది రమ.

"మమతకు దూరంగా తను బతకగలదా?" ఈ ఇంటిలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలోను కొన్నివేలసార్లు వేసుకొన్న ప్రశ్న అదికాని సమాధానం ఒక్కటే "మమత లేకపోతే తాను బతకలేదు" మరి తనమీదవచ్చ అపవాదెలా భరించాలి ఒకవేళ అది అపవాదు కాకుండా నిజమే అయితే? రమ మనస్సు చలించిపోయిందా ప్రశ్నతో

మమత చిలిపిచేష్టలు తలపుకొస్తే రమ ప్రమేయం లేకుండా మనస్సు గతంలోకి జారిపోతుంది తన జీవితంలోని రెండే రెండు మలుపులు రమ కళ్ళముందు నిలుస్తాయి

చిన్నపిల్లల్ని ప్రేమించలేనివారు మానవులు కారని రమ భావించేది చిన్నపిల్లలతో కలిసిపోయి, వాళ్ళ ఆటపాటల్లో భాగం పంచుకొంటే ఎంత పెద్దవాళ్ళనైనా వాళ్ళు మనస్ఫూర్తిగా ప్రేమించగలరు ఆ ప్రేమకు వయో తారతమ్యంలేదు నిస్వార్థమైన ఆ ప్రేమను పొందటం అందరికీ సాధ్యంకాదు

చిన్నతనంనుంచీ పిల్లలంటే వెర్రిప్రేమ రమకు తనకంటె చిన్నపిల్లలతో నీళ్ళు, చిమ్మట్లు పెట్టి బొమ్మలాటలు ఆడుకొనేది ఆ ఆటలలో రోజులు క్షణాలలా గడిచిపోయేవి

"రమ పిల్లలు రమతోతప్ప ఎవ్వరితోను ఆడరు" అనేది అమ్మ నవ్వుతూ యుక్తవయస్సు వచ్చాక కూడా రమ ఆటలు అలాగే సాగేవి పెళ్ళి జరిగిన తరువాత తను పిల్లలతో ఎలా ఆడుకోవాలో ఊహించుకొంటూ మురిసిపోయేది రమ

రమ ముచ్చట చూసిన భగవంతుడు వరం ప్రసాదించాడు ప్రసవవేదన పొందుతోన్న రమ హృదయం ఆనందంతో గంతులు వేసింది. తల్లి కాబోతున్నానన్న ఆనందంలో ప్రసవవేదన చిరునవ్వుతో భరించింది. తనపాప, తన రక్తంలోవిభాగం మనస్సులో మనస్సు, కొన్ని క్షణాలలో కళ్ళు తెరిచి మిరుమిట్లు గొలిపే ఈ లోకాన్ని చూస్తుంది. ప్రకృతివైపు వింతగాను, ప్రాణం పోసిన తనవైపు ఆశ్చర్యంగాను చూస్తుంది చిన్నారి చేతులతో తన హృదయాన్ని పులకరింపజేస్తుంది

కలలలో కరిగిపోతున్న రమకు కాలం ఒక్కసారి స్తంభించిపోయింది కాన్పు కష్టమైంది ఆపరేషను చేసి పాపను పైకితీసారు

రమ కలల పంట ప్రకృతివైపు వింతగా చూడలేదు చిన్నారి చేతులు కదిలించలేదు

వరమిచ్చిన భగవంతుడే శాపం ఇచ్చాడు. చలన రహితంగా పడిఉన్న మాంసపు ముద్దను చూసి భోరున విలపించింది ఇచ్చిన పాపను క్షణాల్లో పుచ్చుకొన్న భగవంతుడ్ని నిందించింది.

రమ హృదయంలోని వెలుగు పూర్తిగా డాక్టరు చెప్పిన విషయం వినగానే ఆరిపోయింది రమకు ముందు ముందు సంతానం కలగకూడదు కలిగితే తల్లి ప్రాణానికే ప్రమాదం సంతాన యోగ్యత లేని జీవితంకంటె చావే మేలనుకొంది రమ

"కాదు మాకోసం నీవు జీవించాలి" అంటున్నారు కన్నతల్లీ, తండ్రీ, కట్టుకొన్న భర్త

రమ తనకోసం కాకపోయినా జీవిస్తోంది మూగబాధ ననుభవిస్తోంది.

అది రమ జీవితంలోని మొదటి మలుపు జీవితంలో ఒక మలుపు తిరిగితే మనకు కష్టంగాఉన్నా, ఇష్టంలేకపోయినా ముందుకే పోవాలి వెనక్కి వెళ్లి మరొకమార్గంలో ప్రయాణం చెయ్యటం సాధ్యం కాదు

మూడు సంవత్సరాల తరువాత రమ జీవితం మరొక మలుపు తిరిగింది చీకట్లో అలమటిస్తున్న రమకు విద్యుల్లత ఎదురైంది

అద్దెయింటికోసం తిరుగుతోన్న రమకు యింటితోపాటు మమతకూడా దొరికింది

"అద్దె ఎక్కువ చెపుతున్నారురమా" శ్రీవారి మాటలు చెవుల్లో జేరటంలేదు మూడు సంవత్సరాల వయస్సులో ముద్దులు మూట కడుతోంది మమత రమ చూపులన్నీ మమత మీదే నిలిచాయి

"పాపా నీ పేరేమిటమ్మా?" శ్రీవారడుగుతున్నారు

"నేను చెప్పనుపో" అంటూ ముఖం తిప్పుకొంటూ రమవైపు చూసి నవ్వింది

"నాకు చెపుతావా?" నవ్వుతూ రమ చేతులు చాపింది ఆచేతుల్లో యిమిడిపోయింది మమత మెల్లగా రమ చెవిలో చెప్పింది తనపేరు రమ పాప చెవిలో చెప్పింది 'మనిద్దరం జంటని' ఆమాట విన్న మమత కిలకిలా నవ్వింది ఆ నవ్వులోని అమృతం బీడువారిపోయిన రమ మనోసీమల్లో జల్లుగా వర్షించింది

"అద్దె కాస్త తగ్గిస్తే నా కభ్యంతరంలేదు" అంటున్నారు శ్రీవారు

"ఇప్పుడు ఖాళీ చేసినవారు అదే అద్దె యిచ్చేవారు" అంటోంది తలుపుచాటున నిలుచున్న యింటి యజమానురాలు

"నువ్విక్కడే ఉండిపో మనం బొమ్మల్తో ఆడుకొందాం" అంటోంది మమత రమతో రహస్యంగా

"అలాగే పాపామతో రేపొస్తాం! అంటోన్న భార్యవైపు ఆశ్చర్యంగా చూసాడామె భర్త "అద్దె ఎక్కువ" అన్నాడు నసుగుతూ 'పరవాలేదు' అంది రమ చిరునవ్వుతో

"అత్త మా యింటికొస్తుందోచ్ మేమిద్దరం బొమ్మలతో ఆడుకొంటామోచ్" అంటూ మమత గుమ్మంవెనక నిలుచున్న తల్లి దగ్గరకు తుర్రుమంది

రమ జీవితంలో రెండవ మలుపది మొదటి మలుపులో చీకటి, రెండవ మలుపులో వెలుతురు

మరునాడా యింటిలో దిగారు మమత సూటిగా రమ హృదయంలోకే దిగింది ఆ యింటిలో దిగిం తరువాత రమ ఏనాడు మమతకు దూరంగా ఉండలేదు

"అత్తా పలకారం పెట్టవు" ఉదయాన్నే రమ దగ్గరకు జేరేది మమత మమత వచ్చేవరకూ సూర్యోదయం కానట్లే రమకు లెక్క.

"బుజ్జిగాడికి పాలుపత్తవూ?" తను ఎత్తుకొన్న బొమ్మ జారిపోతున్నా, అతి కష్టంమీద మోస్తూ వంటగది గుమ్మం ముందుకు వచ్చేది మమత

'ఎవరే మమతా బుజ్జిగాడు?' మమతను ఏడిపించాలని రమ అడిగేది మమత బుంగమూతి పెడితే దాన్ని గట్టిగా గుండెలకు హత్తుకోవాలని రమ కోర్కె

'నా కొడుకు' ఆ మాట అంటూ బొమ్మను ముద్దుపెట్టుకొంటున్న మమతనుచూస్తే రమకు పొట్టచెక్కలయ్యేది

మమత తల్లి పిలిస్తే వెళ్ళేదికాదు తను బ్రతిమాలి క్రిందకు తీసుకువెళ్లాలి కాకమ్మ కథలు చెపుతూ బువ్వ తినిపించాలి జోలపాడుతూ నిద్రించాలి ఒక్కక్షణం రమ కనిపించకపోతే ఇల్లంతా కలియ తిరుగుతుంది మమత

పోయిన దీపావళికి తాను పుట్టింటికి వెళ్లింది తనవాళ్లంతా దగ్గరఉన్నా ఏదో లోపం కనిపించింది రమకు చెప్పుకోలేని వెలితి మనస్సంతా శూన్యంగా ఉన్నట్లనిపించేది అమ్మావాళ్లు ఎంత బ్రతిమాలుతున్నా వినకుండా దీపావళి వెళ్ళిన మరునాడు తిరిగి వచ్చింది

కిటికీలో దీనంగా కూర్చొన్న మమతను చూసే సరికి రమ గుండెలు తరుక్కుపోయాయి కారులోనుంచి దిగుతూనే ఒక్క పరుగులోవెళ్లి మమతను గుండెల కదుముకొంది మమత రెండుచేతులతో రమ మెడను పెనవేసుకొంది అలా ఒకరిలో ఒకరు లీనమైపోతున్నవాళ్ళను విడదీసేశక్తి ఎవ్వరికిలేనట్లు అంతా అలా నిలబడి చూసారు

"ఏనాటి అనుబంధమమ్మా యిది నీవలా వెళ్ళావు మమత మా ఎవ్వరితోనూ మాట్లాడలేదు దిగులుగా అలా కిటికీలో కూర్చొనేది ఏకారు వస్తున్నా నీ వస్తున్నావని గుమ్మంలోకి పరుగుతీసేది అది నిరాశగా వెనక్కి తిరిగివస్తుంటే చూసే వాళ్ళకు జాలివేసేది వాళ్ళనాన్నగారు ముచ్చటపడి, ఎంతో డబ్బుపోసి దీపావళికి మందు సామాను కొంటే ఒక్కటీ ముట్టుకోలేదు నిన్ను చూడగానే దాని ముఖంలో ఎంత కళ వచ్చిందో చూడు" వారం రోజుల కథ ఒక్క గుక్కలో ఏకరువుపెట్టింది మమత తల్లి

"అత్తా టపాకాయలు కాలుద్దామా?" ఉత్సాహంగా అడిగింది మమత

నిజానికి మమత, రమ దీపావళి ఆ రోజే చేసారు తలంటిపోసుకొన్నారు కొత్తబట్టలు కట్టుకొన్నారు మమత కిష్టమైన పిండివంటలు చేసింది రమ మమతతో చిన్నపిల్లలా గెంతుతూ మందు సామాను కాల్చింది రమ

'మమతను విడిచి తా నెక్కడికీ వెళ్లలేదు వెళ్ళినా ఉండలేదు' ఆరోజే నిశ్చయించు కొంది రమ

రమకు చిన్నతనంనుంచీ బొమ్మలంటే పిచ్చి రమ నాన్నగారు ఎక్కడికి వెళ్లినా రక రకాలబొమ్మలు తెచ్చేవారు రమ పెళ్లినాటికి బొమ్మలతో ఒక బీరువా నిండిపోయింది కాపురానికి వచ్చేటప్పుడు బొమ్మలు తెచ్చుకోవడానికి కాస్త సిగ్గుపడింది రమకు సంతానం కలుగుతుందని తెలియగానే బొమ్మల బీరువా పంపారు నాన్నగారు సంతానం దక్కకపోయినా బీరువా చిహ్నంగా నిలిచిపోయింది.

మమతకు ఆ బీరువా అంటే ప్రాణం ఆ బీరువా లోని బొమ్మల్నిచూస్తూ తనూ ఒక బొమ్మలా నిలిచిపోతుంది ఆ బొమ్మలతో మాట్లాడుతుంది. వాటిని పలకరించి తాను నవ్వుతుంది

'అత్తా . మరి కోతిబొమ్మ ఆ పాపను కరవదూ" అంటుంది బొమ్మవైపే చూస్తూ.

'నీలాంటి మంచి పాపల్ని కోతి కరవదు' అని రమ చెపితే తెలిసినట్లు కళ్లెగరేస్తుంది

ప్రస్తుతానికి బీరువా మమతదే ఏ బొమ్మ కావాలన్నా తీసిస్తుంది రమ ఇద్దరూ బొమ్మలతో ఆడుతూ ప్రొద్దేమర్చిపోతుంటారు.

ఒక ముసలి బొమ్మ బీరువా మూలగా పడుకొన్నట్లుంది. దానివైపు చూసిన మమతకు ఏమీ అర్థంకాదు

'అత్తా ఆ బొమ్మ కేమైంది?" అందోకసారి మమత

'జబ్బు చేసింది'

'అంటే'

"జ్వరం వచ్చిందన్నమాట

"వస్తే ఏమవుతుంది"

"చచ్చిపోతుంది."

"పాపం" అంటూ విపరీతంగా జాలిపడింది మమత నాలుగైదుసార్లు ఆ బొమ్మవైపు జాలిగా చూసింది

ఒకసారి రమకు జ్వరం వచ్చింది ఒక రోజు మరీ ఎక్కువైంది. తన వళ్ళు తనకే తెలియలేదారోజు. రమకు భయంకూడా వేసింది మమత నుంచి దూరం చెయ్యడానికి భగవంతుని పన్నాగమేమో అనుకొంది

మగతగా నిద్రపోతోంది రమ చిన్నారి చేతులు తన హృదయంమీద పడినట్లు లీలగా తెలుస్తోంది రమకు వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దంవిని రమ తృళ్ళిపడిలేచింది. రెండు చేతులు ఎత్తి గదిలో ఉన్న దేముడి పటానికి దణ్ణంపెడుతూ ఏడుస్తోంది మమత

ఆ దృశ్యం చూసిన రమ మనస్సు వెన్నలా కరిగింది

"మమతా నిద్రలో ఎందుకు లేచావు? ఎందుకేడుస్తున్నావమ్మా?" మమతను లాలిస్తూ అడిగింది

"నువ్వలా పడుకొంటే నాకు భయం వేసింది. ముసలి బొమ్మలా నువ్వు కూడా చచ్చిపోతావా?" బావురుమని ఏడ్చింది మమత

మమతను గాఢంగా గుండెల కదుముకొంది. తనంటే మమత కెంత ప్రేమ తనకు జ్వరం వచ్చిందని ఆ చిన్నిహృదయం ఎంత కుమిలిపోయిందో ఆ పాప ప్రార్థన విన్న భగవంతుడు చల్లని చూపు తన మీదకు ప్రసరించాడు రమకు మరునాడు జ్వరం దిగజారిపోయింది

గతంలోంచి తృళ్లిపడి వర్తమానంలోకి వచ్చింది రమ

ఆ రోజు తనకు జ్వరంవస్తే తన ఆరోగ్యం కోసం భగవంతుడ్ని ప్రార్థించింది మమత కాని తను ఒక్క పరుగులో వెళ్లి వెంకటేశ్వరుని పటము ముందు నిలిచింది రమ

"మమతను చల్లగా కాపాడు తండ్రీ" కళ్ళ నుంచి నీళ్ళు కారుతుండగా ప్రార్థించింది

"మమతకు మూడు రోజులనుంచి జ్వరం ఇప్పుడెలా వుందో?" ఆ ప్రశ్న రమ మనస్సును పేరు పురుగులా తొలిచివేస్తోంది

మమత దగ్గరకు వెళ్లాలి ఏమైనా, మాటే మనుకొన్నా తను ఆగలేదు అడుగు ముందుకు వేసి ఆగిపోయింది రమ ఉదయం జరిగిన సంఘటన ముల్లులా మనస్సులో గుచ్చుకొంటుంది

రాత్రంతా మమత మంచం దగ్గరే కూర్చొంది ఉదయం పైకి వచ్చి తిరిగి మమత దగ్గరకు వెళ్ల బోయింది. గదిలో నుంచి వినిపిస్తున్న మాటలు మాటేగా రమ హృదయంలో నాటుకొన్నాయి అడుగు ముందుకు పడలేదు

"ఒక్కొక్క తల్లి చూపటువంటిది అందు లోను పిల్లల్లని గొడ్రాలి చూపు మహా చెడ్డది రమాదేవి దృష్టిలో ఎంతలోపం లేకపోతే పువ్వు లాయిలా ఆడుకొంటున్న పిల్ల మంచం ఎక్కు తుంది?" వెంకాయమ్మగారి గొంతు కంచులా మ్రోగుతోంది

"అలా అనకండి రమకు మమతంటే ప్రాణం" మమత తల్లి మెల్లిగా అంటోంది "పైగా ఆ పిల్ల కోసం నిద్రాహారాలు మాని సేవ చేస్తోంది రమ"

"ఆ మంచి సంబడమే ఈ పిల్లను వెనకేసు కొంటే ఇంటి అద్దె కాస్త తగ్గిస్తారని వాళ్ళస్లాను అమాత్రం గ్రహించ లేవటమ్మా" ఇంకా వెంకాయమ్మగారు చెప్పుతూనే ఉంది పై మాటలు రమ వినలేక పోయింది పెనుగాలికి వూగులాడే లతలా వణికిపోయింది తన కాళ్లమీద నిలవలేననే భయం పుట్టింది కాళ్ళు విరిపోతున్నట్లు, తల తిరిగిపోతున్నట్లు అనిపించింది దడదడలాడే కాళ్ళతో వెనక్కి తిరిగి తూలుతూ మేడమీదికి జేరుకొని మంచంమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది ఎంత ఏడ్చినా ఆవేదన తీరలేదు

"తన దృష్టి తగలటంవల్లనే రమకు జ్వరం తగిలిందా? తన దృష్టి మంచిదికాక మమతకు ఏదైనా ప్రమాదం జరిగితే? ఆపైన వూహించలేకపోయింది పిల్లలులేక కుమిలిపోతున్న తనకు దక్కిన వెలుగు మమత— తనలోపంవల్ల ప్రమాదానికి లోనైతే?"

# మమత

'భగవాన్ ఆ శిక్ష వెయ్యకు నేను దూరంగా ఉంటాను ఆ పాప నా మమతను చల్లగా చూడు నా చూపు పాపమీద పడనివ్వను'

'భగవంతుడు తన మొర ఆలకించకపోతే? తన చిన్నారి పాపను పుట్టుకలోనే త్రుంచినట్లు, తనతో స్నేహం చేస్తుందని, మమతను కూడా నిజమే నా చూపు మంచిది కాదు అందుకే నా పాప నేను చూసేసరికి ప్రాణాలతో లేదు మరి మమత ? అలా జరిగితే ఈ అపవాదు జీవితాంతం మాసిపోదు తన్ను నీడలా వెంటాడుతుంది బ్రతికినంతకాలం చిత్రహింస పెడుతుంది తను ఎదురుగా వస్తే ప్రతి తల్లి తమ బిడ్డల్ని దూరంగా తీసుకుపోయి తలుపులు మూసుకొంటారు చిన్నారి పాపలు తనని చూసి భూతం వస్తుందని పారిపోతారు భయంతో తన మీదకు రాళ్ళు రువ్వుతారు. వద్దు వద్దు నా కీ జీవితం పసిబిడ్డల పాలిట యమదూతలా బతకలేను నేను నన్ను నీలో ఐక్యం చేసుకో భగవాన్ మోడువారిన జీవితాలలో ఆనందం చిందించే ఈ పసిపాపలు సుఖంగా వర్థిల్లాలని దీవించు' కిటికీ వూచలకు తల బాదుకొంది రమ ఆవేగం చల్లారటం లేదు

'తాను వెళ్ళిపోవాలి ఎక్కడికి? ఎక్కడికైనా దూరంగా తను కనిపించకపోతే మమత ఏమను కొంటుంది? కొంతకాలం తరువాత మరచిపోతుంది ఈ బొమ్మలన్నీ మమతకే ఇచ్చి పెడతాను మమతను నేను చూడకపోయినా ఆ పాప సుఖంగా ఉంటేచాలు' అంటూ బీరువాలో బొమ్మలన్నీ నేల మీద పేర్చింది బొమ్మల మధ్యలో విలపిస్తూ కూర్చుంది

గదిలో అడుగుపెట్టిన రమ భర్త ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు

'రమా' అన్నాడు నెమ్మదిగా

'ఏమండీ వచ్చారా? మనం ఈ యింటిలోంచి వెళ్ళిపోవాలి' భర్త గుండెల్లో తలదాచుకొంటూ ఏడ్చింది రమ

'ఏం జరిగింది రమా? అద్దె ఎక్కువ, యిల్లు మారదామని ఎన్నిసార్లు చెప్పినా అడ్డు చెప్పే దానివి?'

'అన్నేమీ అడక్కండి ఈ యింటి నుంచి దూరంగా తీసుకుపోండి మీకుదణ్ణం పెడతాను." అంటూ విలపిస్తున్న రమను అర్థం చేసుకోవడం ఆ భర్తకు సాధ్యంకాలేదు

క్రిందినుంచి సన్నగా ఏడ్పు వినిపించింది రాను రాను స్వరాలు పెరుగుతున్నాయి ఆ ఏడ్పులు విన్న రమ నిలువెల్లా వణికిపోయింది

"భగవంతుడికి నా మొర వినిపించలేదు అను కొన్న శిక్ష విధించాడు" తలబాదుకొంటున్న రమను పట్టుకోవడం ఆమె భర్తకు అసాధ్యమైంది

"రమా ఏమిటిది? నాతో చెప్పు?" ప్రేమ మారుతూ అడిగాడు

"నేను పాపిష్టిదాన్ని నా దృష్టిలో లోపం వుంది. అది తగిలిన ఏ పిల్లలూ బతకరు పాపలమీద నా నీడైనా పడకుండా నన్ను దూరంగా తీసుకు పోండి అపవాదు నేను భరించలేను ఏమండీ మీ కాళ్ళు పట్టుకొంటాను నన్ను ఈ అపవాదు నుంచి రక్షించండి అదుగో చప్పుడు విని పిస్తోంది ఎవరో వస్తున్నారు నన్ను ముళ్ళతో పొడిచి చంపుతారు నన్ను కాపాడండి వాళ్ళు వచ్చేలోపుగా నా ప్రాణాలు తీసుకో భగవాన్" పెద్దగా అరుస్తూ అచేతనంగా భర్త చేతిలో వాలి పోయింది

రమకు చల్లని చేతులు తగిలేసరికి మెలకువ కలిగింది మమత తన కళ్ళు తుడుస్తోంది ఇది కల కాదు నిజమే తన మమతే మమతను తన హృదయంలో కరిగించుకోవాలని మీద మీదికి లాక్కొంది

"ఏమమ్మా ఏమైంది" మమత తల్లి అడుగుతోంది

"కళ్ళు తిరిగాయండి" అంది మమత ముఖంలోకే చూస్తూ

"రాత్రిపగలు నిద్రలేకుండా మమతకోసం పాటుపడ్డావు నీ చేతి చలవ వల్లే ఈ పూట జ్వరం దిగజారింది కళ్ళు తెరిచిన దగ్గరనుంచీ అత్తకావా లని ఒకటే పాట" చెప్పుకుపోతుందామె

"ఇందాకటి ఏడ్పులు" మాట పూర్తి చెయ్యలేకపోయింది రమ

"అది పాపం వెంకాయమ్మ మనవడు ప్రొద్దుట వాళ్ళ మామ్మ వెనకే వచ్చాడు ఏంజబ్బో పాపం ఆడుకొంటున్న కుర్రాడు రక్తం కక్కుతూ పడి పోయాడట క్షణాల్లో పోయింది ప్రాణం కలి కాలం ఒక్కసారి వెళ్ళిచూసొస్తాను గుండెలు పగిలేలా ఏడుస్తున్నారు నీ కోడల్ని నీ కప్పచెప్పి నేను వూరంతా తిరిగినా ఫరవాలేదు వస్తా" మమత తల్లి నవ్వుకొంటూ వెళ్ళిపోయింది

"అత్తా నువ్వు కనిపించకపోతే ఎక్కడికైనా వెళ్ళిపోయావని భయంవేసిందత్తా నన్ను విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్ళిపోకే అత్తా" మమత రమ కౌగిలిలో యిమిడిపోతూ అడిగింది

"వెళ్ళను మమతా నిన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళలేను" అంటూ మమతను మరింత గాఢంగా తన హృదయానికి హత్తుకొంది మరిగిన హృదయం చల్లబడేసరికి కళ్లనుండి నీరు జల్లులా కురిసింది

రమ ఎందుకు వెళ్ళిపోదామందో, అంతలోనే మనస్సెందుకు మార్చుకొందో అర్థంకాక అలా వాళ్ళిద్దర్నీ చూస్తూ నిలబడ్డాడామె భర్త. ●

